# ఉద్యోగ విరమణ

'ఎప్పటి కప్పుడు బ్రతుకుతో రాజీపడి రోజుల్ని నెట్టుకొస్తున్న వాళ్ళే ధన్యులు' అనే మధ్యతరగతి నమ్మకం గురించి జీవితం నడిపడిలోపడ్డప్పుడుగాని మొదటిసారి ఆలోచించుకోలేకపోయాడు ప్రకాశం. అప్పటిదాకా తనను నడిపిన ఆశలు, ఆశయాలు. కలలు, కావ్య మధురిమలు ఎడారిలో పడ్డ వాన చినుకులు రూపులేకుండా మాయమైనట్లు మానిపోగా అంతర్ముఖుడై ఆలోచించసాగాడు. 'అనాయాసేన మరణం, వినా దైన్యేన జీవనం' అనే నిత్య ప్రార్థనను నేర్పిన పూర్వీకుల అధ్యాత్మిక జ్ఞానం స్మృతికి వచ్చినప్పుడల్లా. తన అర్థశూన్యమైన ఇరుకు బ్రతుకు ఆ మహత్తర ధ్యేయాలకు నోచుకొన్నదా అని నిస్పృహారవంలో పడిపోయినప్పుడుగాని, ఉగ్గుపాలతోపాటు అమ్మ నేర్పించబోయిన ప్రాచీన జీవన రహస్యాలకు తోడుగా తన యౌవనంలో సంతరించుకొన్న శాస్త్రీయ సామ్యవాద వేదాంతం తనవంటి ఏకాకి మనస్కులకు ధైర్యం నేర్పలేవని అంతరాత్మ నొక్కి వక్కాణిస్తున్నప్పుడుగాని తన భవిష్యత్తు ఇంత నిష్ప్రయోజనంగా మారనున్నదని ప్రకాశం ఊహించలేదు.

ఏ అశాంతితోనైతేనేం, కాలం జరిగిపోతూనే ఉంటుందిగదా అని గాటబడ్డ ఎద్దువలె రోజుల్ని నెట్టుకొస్తున్నప్పుడు రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చింది. ఉద్యోగ విరమణ ఆర్డినెన్సును అకస్మాత్తుగా ప్రకటించింది. ఏమీ సబ్బు చెడని ఆరోగ్యంతో, యాభై అయిదేళ్ళ వయసులో ప్రకాశం ఇప్పుడు నిరుద్యోగి. నిర్వ్యాపారి అయి కూర్చున్నాడు. ఉద్యోగం చేస్తున్నప్పుడు తన రిటైరుమెంటు ఎప్పుడొస్తుందా అని ఆశాజనకంగా ఎదురు చూచిన ముహూర్తాలు, విశ్రాంతిలో తను చేయదలచుకున్న అనేకానేకమైన కార్యక్రమాల తర్జన భర్జనల మనోల్లాసం రంగుల కలగాని నిజమే అయినట్లయితే ఈ వయసు తగ్గింపు ఆర్డినెన్సు తననేమీ చేయగలిగేది కాదు.

కాని, రుక్మిణి-తన భార్య తన జీవితమంతా అందుకోవాలని ప్రయత్నించిన ఆకాశ కుసుమాలకు, తను నిల్చిన కఠిన పాషాణ భూమికి మధ్య శత సహస్ర యోజనాల దూరం ఉందని సూటిమాటలతో తెలియజెప్పుతున్నది. అంతేకాదు,

ఆమె అంటున్న మాటలు తాత్కాలిక కోపంతో వెళ్ళగక్కిన ఆవేశపు పలుకులు కావని, తమ పెళ్ళినాటినుంచి తన అప్రయోజకత్వాన్ని మదింపు చేసి, ఇన్నాళ్ళూ సామాజిక మర్యాద కోసం తనలోనే గరళంగా ఇముడ్చుకొని ఈనాడు తను సగం జీతంతో కుటుంబం ఎదుట నిస్సహాయుడుగా నిలిచినప్పుడు బయటకు వెళ్ళగక్కిన మాటలని ప్రకాశం ధ్రువపరచుకొన్నాడు.

ఉద్యోగ విరమణ చేసిన తేదీ సాయంత్రం ప్రకాశానికి ఆఫీసులో వీడ్కోలు పార్టీ ఇచ్చారు. తనపై అధికారుల పార్టీలకుగాని, కింది తాబేదారుల పార్టీలకుగాని ఎన్నడూ ఖాతరుచేయని వాళ్ళ డైరెక్టరు ప్రకాశాన్ని జీపులో ఎక్కించుకొని ఇంటివద్ద దిగబెట్టిపోతూ, సీటులో తను వదిలి వచ్చిన రెండు పెద్ద పూలదండల్ని స్వయంగా అందించి చివరిసారిగా చేయి కలిపి వెళ్ళిపోయాడు. పూల దండల్ని చేతిమీద వేసుకొని ప్రకాశం ఇంట్లో ప్రవేశించగానే మొదటి గదిలోనే రుక్మిణి, పిల్లలు, అల్లుడు అందరూ ప్రత్యక్షమయ్యారు. చేతిలోవి ఎవరూ అందుకోలేదు. ఏదో జరగరానిది సంభవించినట్లుగా ఎవరూ మాట్లాడలేదు. రుక్మిణి లోపలికి పోయి మంచినీళ్ళు తెచ్చిస్తూ- "రిటైరు అయినట్లేనా? మొత్తం ఎంతొస్తుంది?" అని ప్రశ్నించింది, ఉపోద్ఘాతం లేకుండా.

ప్రకాశం మంచినీళ్ళ గ్లాసు కిటికీ అంచుమీద పెట్టి, బయటికి జారుకొంటున్న అల్లుడివంక చూస్తూ- "ఎంతో కొంత! సర్వీసు లెక్కప్రకారం ఇస్తారు. ఒక దమ్మిడీ ఎక్కువా రాదు, తక్కువా రాదు" అని నింపాదిగా అన్నాడు.

"అదే - ఎంతని?" అని మళ్ళీ రుక్మిణి రెట్టించింది.

"గ్రాట్యుటీ అయితే ఒక పాతిక వేలుంటుంది. ఫించనయితే అంతా కలిపి అయిదొంద లుండవచ్చు."

"ఈ సంబడానికేనా? పిల్ల పెళ్ళి ఎట్లా చేద్దామనుకున్నారు? వాడి చదువేం చేద్దామనుకున్నారు? ఈ సంసారాన్ని నట్టేట ముంచటమేనా మీ ఘనకార్యం?"

ప్రకాశం నిర్ఘాంతపోయి - "అంతా నా తప్పే నంటావ్? అంతేనా?" అని భార్య వంక చూశాడు.

"గురుమూర్తిగారికి లక్షపైన వస్తుందిట. మీకెందుకు రాదు?"

కొంచెం ఆగి తాపీగా మాటలకోసం వెతుక్కున్నాడు.

"ఆయనది నా కన్నా పెద్ద ఉద్యోగం. ఒక్కడే కొడుకు. ఫండులో సగం జీతం నిలవ చేసుకున్నాడు."

"మీరు చేసిన ఘనకార్యం ఏమిటి? మీరెందుకు ఫండులో వేసుకోలేదు?"

ప్రకాశానికి మండిపోయింది.

"ఘనకార్యం, ఘనకార్యం అంటూ ఎందుకు దెప్పిపొడుస్తావ్? చూస్తూ కూడా అర్థం చేసుకోలేకపోతే నా తప్పు కాదు. ఈ పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళూ ఏ ఫండులోంచి తీయండీ ఇంతవరకూ నెట్టుకొచ్చాం అనుకొన్నావ్?"

ప్రకాశం లోపలికి అడుగు పెట్టాడు, ఇక సంభాషణ ముగిసిపోయినట్లే అని. కాని, రుక్మిణి రెండు చేతుల్తో నెత్తి బాదుకుంటూ- "నా బతుకు అన్ని విధాలా నాశనం చేశావ్. మా నాన్న, మేనమామలు నీ కిచ్చి పుణ్యం కట్టుకున్నారు" అని రోదన ప్రారంభించింది.

ప్రకాశం ఆమె ఏకవచన ప్రయోగం విన్నాడు. ఇదివరలో తన మీద ఈగ వాలనివ్వని పెద్ద కూతురు, మామగారు చాద స్తపు అమాయకుడైనా మంచి వాడే అని తనలో తాను నవ్వుకొనే అల్లుడు, మొన్ననే పెళ్ళాడి మామగారి ద్వారా ఉద్యోగం సంపాదించిన పెద్దకొడుకు, ఇంకా తన స్వభావాన్ని పైకి కనబరచని కొత్త కోడలు, తన కాలేజీ సీటుకు, ఉద్యోగానికి అందరి తండ్రుల వలె ఎవరి రికమెండేషన్లూ సంపాదించలేని నాన్నగారంటే చిన్న చూపు ఏర్ప రచుకొన్న చిన్న కొడుకూ, తనకు ఎవరో ఇంజినీరు కుర్రవాడి పెళ్ళి సంబంధం తెస్తాడని మురిసిపోతుండగా ఒక్క మాట లేకుండా ఉద్యోగం ఊడగొట్టుకొన్న తండ్రి మీద కినుక వహించిన చిన్న కూతురూ అందరూ విన్నారు. ఎవరూ రుక్మిణిని వారించలేదు.

ఒకప్పుడు తన ఆకాశంలోని చుక్కలు వీళ్ళంతా. ఆఫీసే కారాగారం అనుకొన్న రోజుల్లో ఈ ఇల్లు తన విడిది. తన అవసరం అందరికీ తీరిపోయిందా? లేక తనే అంత నిష్ప్రయోజకుడా? ఈ ధనస్వామ్య, అసమాన, క్రూర బూర్జువా వ్యవస్థలో తనవంటి సామాన్య ఉద్యోగి చేయగలిగిన దేమిటి? ప్రకాశానికి చాలా రాత్రికి . మూడవ ఝాములో నిద్ర పట్టింది. రుక్మిణి భోజనంకూడా మానివేసి

నట్లుంది. తనను ఎవరూ కదిలించకపోయినా, అందరూ చుట్టూ మూగినట్లుగాను, ప్రశ్నిస్తున్నట్లుగాను కలత నిద్రలో అనుకొన్నాడు.

ఈ రాత్రి, ఈ చీకటి, ఈ తాత్కాలిక విశ్రాంతి అప్పుడే మృగ్యమై పోతున్నాయా? అని తెల్లవారుతూంటే భయపడటం అతని వంతయింది. ఎప్పుడూ లేనిది నిద్రమాత్రలు అలవాటు చేసుకున్నాడు. అయినా నిద్ర ఆకాశ కుసుమంగానే దూరదూరంగా, దుర్లభ్యమైన వరంగా జారిపోతున్నది.

ప్రొద్దున్నే తన షేవింగు సెట్టూ, వేణ్ణీళ్ళూ చిన్న కొడుకు టేబిలుమీద పెట్టకపోయినా, తను వేడి కాఫీ తాగిందాకా కనిపెట్టుకొని చిన్న కూతురు ఇప్పుడు కూర్చోకపోయినా, మాగజైన్లూ, పత్రికలూ కొని తెచ్చి పెద్ద కూతురు తనకు స్వయంగా అందించకపోయినా ప్రకాశం వ్యధ చెందలేదు. 'రుక్మిణి ఇట్లా ఎందుకు తయారైంది? ప్రపంచమంతా తోసిరాజని ఈసడించినా, భార్య అనురాగంతో ఏ మానవుడైనా పరిస్థితులకు ఎదురు నిలవగల'దని ఎక్కడో చదివిన సత్యం అతనికి జ్ఞాపకం వచ్చింది. తనతో అన్నీ పంచుకొంటానని అగ్ని హోత్రం ముందు, వేద వాక్యాల సాక్షిగా నిశ్శబ్ద వాగ్దానం చేసిన తన కోమల మూర్తి రుక్మిణి ఈనాడు తనతో ఏమీ పంచుకోనంటున్నది. ఆఫీసు వీడ్కోలు పార్టీలో డైరెక్టరు తనను గురించి నిండు సభలో పలికిన పలుకులు జ్ఞప్తికి రాసాగాయి:

"ప్రకాశం - అంటే సూర్యుడు, జ్యోతి, వెలుగు. ఆ ప్రకాశం ఈనాడు ప్రభుత్వానికి పనికిరాకుండా పోతున్నాడు. ఎవరైతే తన విధిని ఒక పవిత్ర యజ్ఞంగా భావించి, ప్రజోపయోగమే ప్రభుత్వ చట్టాల ధ్యేయమని పూర్తిగా నమ్మి, మీలో ఎంత మందికో గురువుగా, మార్గదర్శకుడుగా నిలిచిన వ్యక్తి - ఆఫీసునుంచి ఒక్క పెన్సిలుముక్క కూడా జేబులోవేసుకొనిపోని నిష్కళంకుడు - ఒక్క ఆఫీసు ప్రొసీజరే కాకుండా, టెక్నికల్ విషయాలు గూడా క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకొని నాకు కూడా అనేక సమయాల్లో జ్ఞానమార్గం చూపిన ఉద్యోగి: ఆయన వేకెన్సీలో ప్రమోషన్లొస్తాయని ఉవ్విళ్ళూరుతున్నవాళ్ళు గూడా ఉండవచ్చు. కాని, నా అనుభవంలో ఇంతమంది కొత్త ఉద్యోగులకు చక్కని తర్ఫీదు నిచ్చిన వ్యక్తిని చూడలేదు. మీలో ఎంతమందికి తెలుసో - ఆయన చదివిన సాహిత్యం, సముపార్జించిన జిజ్ఞాస, జ్ఞానం, అనుభవం - లంచగొండ్ల

మయమైన ఈనాటి ఆఫీసుల్లో అరుదైన సంపద. ఆయన పోకడ ఆయనకు గాదు - ప్రభుత్వానికి నష్టం."

ప్రకాశం కండ్లు మూసుకొని, చండశాసనుడనీ, అత్యంత సమర్థుడనీ, మితభాషి అనీ పేరు తెచ్చుకొన్న డైరెక్టరుగారి వదనం స్మృతికి తెచ్చుకొంటూ 'నిజంగా ఆ మాటలన్నీ తన గురించేనా?' అని ఆశ్చర్యపోయాడు.

ఉద్యోగం గురించి రిట్ పిటీషన్లు ప్రకాశం పెట్టలేదు. ఆలోచించలేదు. తనకు రావలసినవి రాబట్టుకోవడానికి రెండు మూడు నెలలు అటు ఇటు రూల్సు. రెగ్యులేషన్లంటూ వేధించే ఆఫీసుల చుట్టూ తిరగటం మాత్రమే చేశాడు. రాగానే భార్యకిచ్చి "మనం ఈ నగరంలో బతకలేము. మన ఊరు వెడదాం" అన్నాడు.

రుక్మిణి తీక్ష్ణంగా చూసి "నేను రాను. బిడ్డలంతా ఇక్కడ, మన మక్కడనా? ఆలోచనలకు అర్థం ఉండాలి. ఏదైనా ప్రైవేటు ఉద్యోగం చూసుకొంటే కందిపోరు మనుషులు" అన్నది.

ఆ పై వారంలో నిజంగానే ఒక ట్రేడ్ యూనియన్ ఆఫీసులో ఉద్యోగానికని ప్రకాశాన్ని పిలిచారు.

అక్కడ తను ఊహించినట్లు రాజకీయ చర్చలు, యూనియను విషయాలు గాదు తీర్చిదిద్దుతున్నది. ఏదో కంపెనీ మేనేజరును దారి కాచి తన్నటానికి కొద్ది మొత్తాల్లో డబ్బు చేతులు మారుతూండడం చూసి మరునాడే ఆ ఉద్యోగం మానుకొన్నాడు. రౌడీలకు, రాక్షసులకు నిలయమైన యూనియన్లు, విద్యార్థి ఉద్యమాలు - వాటి నిత్య హింసా శాసనమే విప్లవమని వామపక్షాభిమానుల్ని మభ్యపరచి, రాచకీయ వ్యవస్థను చేజిక్కించుకొనే వ్యూహ రచనకు పునాది రాళ్ళయిన శాస్త్రీయ, సామ్యవాద సిద్ధాంతాలను, సామ్యవాద దేశాల సుదీర్ఘ పోరాటాలను విస్మరించటం ఎట్లా సాధ్యమైనదో ప్రకాశం దీర్ఘంగా ఆలోచించాడు. ఈ నగర వాతావరణంలో ఏ దుష్ట రాజకీయమైనా సుసాధ్యమే అని సమాధాన పరచుకొన్నాడు. ఆ తరవాత తన స్వగ్రామం మీది తపన, ఆవేదప వేధించసాగింది.

శివసాయుజ్యం పొందిన అమ్మకు అన్నదమ్ములు చేసిన వాగ్దానం ప్రకారం స్వగ్రామంలో ఇల్లు మళ్ళీ పునరుద్ధరించటం ఈ పరిస్థితుల్లో సాధ్యమేనా?

ఆ పురాతన గృహ ఆవరణలో మామిడి చెట్టు కింద కూచుని ఒక గంట కాలం ధ్యానంలో ఉండగలిగితే, ఈ నాటి అనుక్షణ మానసిక వేదన మాయమై పోదా? చిన్ననాటివలె సూర్యుడితోపాటు మెల్కొని చెరువు కట్టమీది ఉత్తరేణి వేరుతో ముఖ ప్రక్షాళనం చేసుకొని, నేస్తగాళ్ళతో చెరువులో స్నానాదులు ముగించుకొని, తడి గుడ్డల్తోనే భావనారాయణస్వామి గుళ్ళో ప్రదక్షిణలు పూర్తి చేసుకొని, ఆచార్లుగారు చిరునవ్వుతో పెట్టిన ప్రసాదం కళ్ళకద్దుకుని, అమ్మకు చూపి తింటూ పాతాలకై బాసీపట్టు వేసి కూచోటంలోకలిగే ఆనందం మళ్ళీ పొందగలనా? అనుకున్నాడు. మామిళ్ళపల్లి హరిదాసు కీర్తనలు.... పోగుల లక్ష్మయ్యగారి ఆయుర్వేద చికిత్సతో ఏ మొండి రోగమైనా దూరం చేసుకునే తన గ్రామ ప్రజలు ఎంత అదృష్టవంతులు?

నగరంలో వేలాది డాక్టర్ల ఆస్పత్రుల ముందు అంతులేని ఈ రోగులు, జేబులో డబ్బు లేనిదే బతుకుమీది ఆశ వదులుకోవలసిన ఈ కలియుగ పతనావస్థ, అడుగడుక్కూ ఎదురయ్యే సమస్యల విషవలయం - వీటినుండి దూరంగా పోదలుచుకున్న తనను రుక్మిణి ఎందుకు అర్థం చేసుకోలేదు?

వెనక ఒకటి రెండుగా కాల్చిన సిగరెట్ల అలవాటు పది పన్నెండు దాటుతూండగానే రుక్మిణి ఇంట్లో చిల్లర డబ్బులు తన కంట పడకుండా కట్టుదిట్టం చేసినట్లుంది. తన తండ్రి వలెనే తనుకూడా ధనం మానవుడి గులాంగా భావించి డబ్బును అందరికీ కనబడే అలమారులో పెట్టేవాడు. తన పెద్దకొడుకు కూడా తన అలవాటునే పాటిస్తుంటే సంతోషించాడు. ఇప్పుడు అత్తాకోడళ్ళు తనను బిచ్చగాడి కింద కట్టేసినట్లున్నది. పెళ్ళిళ్ళు, అల్లుళ్ళు, కోడళ్ళు, సొమ్ములు, వస్తు సేకరణ. స్త్రీ జన్మకిదేనా సంపూర్ణత్వం? చుట్టూ అలముకొన్న దుఃఖతప్త జీవనం. దైన్యం, ఈ అంతులేని యుద్ధాలు, కలహాలు, ప్రతిపక్షాలు పాలనా పక్షాల పేరుతో, వార్తా వ్యాపారం పేరుతో ప్రతి దినమూ నేరాల్ని, అసూయా ద్వేషాల్ని రెచ్చగొట్టే ఈ అనాగరికులైన నాగరికుల కుతంత్రాలు వీళ్ళను కదిలించవు కాబోలు!

పెన్షన్ డబ్బు తెచ్చి ఇంట్లో ఇవ్వటానికి మించి తన ప్రాముఖ్యం ఇంట్లో కనిపించకపోయినా ప్రకాశం తన ఆలోచనలకు తుది రూపం కనుగొనలేకపోతున్నాడు పెద్ద కొడుకు ఉద్యోగం గురించి విచారించి తను చేయగలిగిందేమైనా ఉన్నదా అని మొదటిసారిగా పలకరించాడు.

"మీకు అర్థం కాని విషయాల్లో ఎందుకు జోరబడతారో తెలీటం లేదు డాడీ!" అన్నాడు వాడు. ఆ మర్నాడే పని మనిషికి పది రూపాయలిచ్చి తెప్పించు కొంటున్న పాల పాకెట్ల పనిని తెల్లవారు ఝామున లేపి రుక్మిణి తనకే పురమా యించింది.

ఈ నాలుగయిదు నెలల్లోనే వృద్ధాప్యపు కబంధ హస్తాలు తనను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్లు జాగ్రదవస్థలోనే కాదు- స్వప్నంలోనూ, సుషుప్తిలోనూ ప్రకా శానికి తోస్తున్నది. ఆ రోజు ఉదయం ఎందుకో శిరస్నానం చేసి, తల దువ్వు కుంటూ, మొన్న మొన్నటిదాకా నల్లగా ఉన్న తన క్రాపులో సగభాగం తెల్లబడ్డదా అనుకున్నాడు. పలితకేశాల్ని గురించి దువ్వూరి రామిరెడ్డి వ్రాసిన పదాలు స్మృతికి వచ్చిఅద్దం ముందు పది క్షణాలు కర్తవ్యతా మూఢుడై నిలబడి పోయాడు. 'సుందరకాండ'లో రావణుడు అశోక వనంలో బందీగా ఉన్న సీతా దేవితో అంటాడు—

"పర స్త్రీలను అపహరించటం రాక్షస కుల ధర్మం. కనుక నేను తప్పు చేశానని అపోహ పడవద్దు."

అట్లాగే జరామరణాలనే కవల రాక్షసులు కూడా తనతో అంటున్నారు: "జరా రోగ మరణాలు మానవ జన్మలకు అధిగమించలేని శాశ్వత శాపాలు. మమ్మల్ని తప్పు పట్టవద్దు. నీవు నిందించినా, ప్రార్థించినా, భయంతో పారి పోయినా, ధైర్యంతో ఎదురు నిల్చినా నీ నీడలో మేము నడుస్తూనే ఉంటాం. ఇది ప్రకృతి ధర్మం." తన బ్రతుకులో పురోగమనం ఎన్నడో నిష్క్రమించింది. భయాందోళనా పరాభవాల్లో ముదుసలిగా, అనామధేయుడిగా ఈ మహానగరం లోని అసంఖ్యాక జనవాహినిలో బదుకీడుస్తున్న ఒక వ్యక్తిగాకూడా కాకుండా ఏ శ్మశానవాటిక దిశనో పయనిస్తున్న నికృష్ట నిర్భాగ్యుడిగా తనను తాను పోల్చుకున్నాడు ప్రకాశం.

ఏమీ తోచక తన ఇంటి విషయాన్ని మాత్రం కప్పిపుచ్చుతూ, ప్రతి సమ స్యనూ నెమ్మదిగా ఆలోచించే తమ్ముడికి ఉత్తరం రాశాడు ఏం జవాబు ఆశిం చాడో తనకే తెలియదు. కాని, నాలుగో రోజుకల్లా తిరుగుజాబు వచ్చి చేరింది.

"అన్నయ్యా, నీ శక్తిని నీవు గ్రహించలేని మనస్తత్వం చిన్నప్పటినుంచీ నీకు అలవడింది. రిటైరు కావటం జీవితాంతం కాదు. అది ఒక మలుపు. మార్పు. అసలు జీవితం ప్రారంభం ఇకనుండే. ఎందుకంటావా? ఎంతో జీవితానుభవం

ద్వంద్వాతీతంగా జీవితాన్ని నడుపుకోవాలని నీకూ, ఆ మాట కొస్తే ఆలోచించ గల వాళ్ళందరికీ నేర్పి ఉంటుంది. నీ ఉత్తరం నిండా అగమ్యమైన ఆందోళన, అకారణమైన భయం మాత్రమే నేను చదివాను. ఇవి నెగెటివ్ శక్తులు. అయినా, నీకు కలుగుతున్న జిజ్ఞాసకవి నాందీ పాఠాలు. భయంతో ఆలోచించకు. జిజ్ఞాసతో ఆలోచించు. మార్పు తథ్యం గనక దాన్ని రాజీగా అంగీకరించు. మా అందరికన్నా ఎంతో ఎక్కువగా చదివావు. అజ్ఞానాన్ని అజ్ఞానమని ఎందు కనుకుంటావు? వృద్ధాప్యాన్ని మహా భూతంగా ఎంచుతున్నావా? నీ మనసు సవ్యంగా ఉంటే వృద్ధాప్యం నీ జోలికి రాదు. నీకు తెలుసా-కొందరు మనుషుల్ని అసలదేమీ చేయలేదు. నీవు చేయవలసింది ఈ సమాజంలో కూడా చాలా ఉంటుంది; ఉన్నది. నీవు పాశ్చాత్య వేదాంతం ఎక్కువ తిరగేశావు. కాని, మన సంస్కృతిలో అదంతా ఇమడదు. కొంతవరకే. సాయంత్రాల్లో రామకృష్ణ మఠంలో నడిచే వేదాంతోపన్యాసాలు విను. మార్క్సిజం గురించి ఇదివరలో నీవు జీర్ణించుకొన్నదంతా వ్యాసాలుగా రాయి. మళ్ళీ ఎక్కడైనా ఉద్యోగం ఎట్లాగూ చేయలేని తత్త్వం నీది. టెక్నికల్ బుక్స్ ఏజెన్సీ తీసుకుని చిన్న వ్యాపారం పెట్టు. నీకు పొద్దు పోవటమే గాదు-ప్రాక్ పశ్చిమ మార్గాల రెండు అంతరాలూ బోధపడతాయి. మనకన్నా నికృష్ట జీవనం గడుపుతున్న వాళ్ళకు కూడా నీ వంటి వాళ్ళ సహాయం అవసరం కదా! అయినా, వదినె తెలివి గలది. వీకేమీ సలహా ఇవ్వలేదా?"

వదినె తన చేతిలో దమ్మిడీకూడా మిగల్చలేదని తమ్ముడికి తెలీదు. అయినా, తమ్ముడి ఉత్తరం కొంత ధైర్యాన్ని సమకూర్చింది. దినం మార్చి దినం గడ్డం చేసుకుంటున్నాడు. సాయంత్రాల్లో వేదాంతోపన్యాసాలు వినటానికి అటు రామకృష్ణ మిషన్‌వైపో, ఇటు శంకరమఠంవైపో వెళ్ళుతున్నాడు, వింటు న్నాడు. అగమ్య గోచరంగా ఉంటున్నది. ఈ ఉపనిషత్తుల సారాంశం చాలా గుహ్యంగా ఉన్నది. అతి సనాతనంగా ఉన్నది. తన అందుబాటులోకి వివేకా నందుడు చెప్పిన కొద్ది విషయాలే వచ్చినవి:

"పాశ్చాత్యుల క్రమశిక్షణా, టెక్నాలజీ, పరిశుభ్రతా నేర్చుకో. గుహ్యం, సనాతనం అయిన నీ సంస్కృతి[illegible]తో మేళవించు. పురోగమించు. ఇదే నీ యజ్ఞం."

శంకరమఠంలో కూర్చున్నప్పుడు అందరివంకా పరికించి చూశాడు. తన ఈడువాళ్ళూ, తనకం[illegible] పెద్దవాళ్ళూ, తనచుట్టూ వృద్ధులు... వృద్ధులు.

ఎక్కడా ఆశ్రయం దొరకక, స్వగృహాల్లోనే శాంతి కరువై. ఎవరికీ తమ గోడు చెప్పుకోలేక, భయంతో, భీతితో జీవితాంతం గురించి ఆలోచించలేక ఇక్కడ శరణాగతి పొందుతున్న అభాగ్యులా వీరంతా? గడ్డాలు మాసి, కళ్ళలో కాంతిపోయి, అడ్డు పడుతూన్న ఆత్మాభిమానంతో ఒకరి నొకరు పలుకరించుకో లేక మహానగర మనబడే ఆత్మ లేని ఈ క్రిక్కిరిసిన ఖైదులో ఎటూ తప్పించుకు పోలేని జరాపీడితులా ఈ నిర్భాగ్యులందరూ? ఈ వేదాంత సారాన్ని గ్రహించ లేక, జీర్ణించుకోలేక తననూ, వాళ్ళనూ పోల్చుకుంటూ కొద్ది రోజులు బలవం తంగా హాజరయినాడు. తమ్ముడి ఉత్తరం ఇచ్చిన మొదటి ధైర్యం సడలిపోగా, ఆ రోజు రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరాడు చిన్న కూతురు నాన్న ముఖం చూసి కొంచెం బిత్తరపోయి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. వెనుకనుంచి భార్య మాటలు వినిపిస్తున్నాయి - "జరిగిన ఆలస్యం చాలకనా? అన్నం వడ్డిస్తున్నానని చెప్పు." అన్నం తిన్నాననిపించి తన ప్రయాణంలో తను ఏకాకి యాత్రికుడు కాదను కున్నాడు.

శంకరమఠంలో కదలక మెదలక కూర్చుని ఉపనిషద్వేదాంతం వింటున్న ఆ వయసు మళ్ళిన వాళ్ళంతా తన తోడి ప్రయాణీకులే అనుకున్నాడు. కాని, తనకు తోడుగా చేయూత ఇచ్చి, సేదతీర్చే మాటలతో, విశ్వాసంతో తనతో పాటు అడుగులు వేసేదెవరు? ఆ యాత్రిక బృందంలో ఒక్కరూ లేరనిపిం చింది. మళ్ళీ తనది ఒంటరి యానమేనా? ఎందుకు జన్మ నెత్తాడు తను? ఎత్తినా ఎందుకు పెళ్ళి చేసుకున్నాడు? చేసుకొన్నా ఇంతమంది సంతానాన్ని కన్న దెందుకు? 'బహు కుటుంబం బహు దుఃఖం' అని పెత్తల్లి అంటున్న మాటల్ని తనెందుకు జీర్ణించుకోలేదు? కన్నా తన బిడ్డల కందరికీ సరైన నాయకత్వం, రక్షణ ఇవ్వలేని నిస్సహాయుడుగా తనెందుకు మారిపోయాడు? అన్నింటికీ వ్యవ స్థను తిట్టుకుంటూ తన ధర్మాన్ని తాను మరిచిపోయినట్లు ఇప్పుడు పశ్చాత్తప్తుడైనా ప్రయోజనమేమిటి? చివరకు ఈ స్తంభన నుండి తనకు విముక్తి లభించే దెట్లా?

ప్రకాశం చివరి ప్రశ్నకు అనూహ్యంగా ఒక వారం రోజుల్లోనే సమాధానం లభించింది. ఉద్యోగం విరమించిన మొదటి రోజుల్లో గోవిందరావుగారి బలవంతం మీద 'కేర్ ఫర్ ది సీనియర్స్' అనే రిటైర్డు ఉద్యోగుల వానప్రస్థ సంస్థలో సంవత్సరం చందా కట్టి చేరాడు. అందులో పింఛను తీసుకుంటున్న జడ్జీలు, అధికారులే కాక వృత్తి విరమించుకున్న లాయర్లు, డాక్టర్లు, కొందరు వ్యాపార

వేత్తలు, మిలిటరీ అధికారులు ఎందరో సభ్యులు. గ్రంథాలయం ఉంది. అప్పు డప్పుడు మెడికల్ చెకప్స్ ఉచితంగా చేయించుకోవచ్చు. ఉద్దండుల ఉపన్యా సాలు. ఒక్క రాజకీయాలే లేనివి.

ఈ వారం రోజులనుంచీ ప్రకాశం గంటలతరబడి ఆ లైబ్రరీలో కూర్చొని మాగజైన్లు, పుస్తకాలు ఓపిగ్గా తిరగేస్తున్నాడు. గ్రంథాలయం వరండాలో ఉండటం అతని కిష్టంలేదు. ఒళ్ళు తిరిగేవాళ్ళు, కళ్ళు తిరిగేవాళ్ళు, రక్తపుపోటు వాళ్ళు - అందరూ దాదాపు తనకంటే పెద్ద వయసువాళ్ళే. పెళ్ళి సంబంధాలు - మనుమలకో, మనుమరాండ్రకో - ఆలోచించే వాళ్ళ బారినుండి తప్పించుకుని గ్రంథాలయం గదిలో కాలక్షేపం చేయటం అతనికి మొదట్లో తృప్తిగానే ఉంది. తనవంటివాళ్ళు భగవంతునికి ఎందుకూ కొరగానివాళ్ళు.

స్తుతి, స్తోత్రం, అర్చన, ధ్యానం, యజ్ఞం - ఏదీ మనఃస్ఫూర్తిగా ఆచరించలేని తనకు, ఆ గది మసక చీకటిలో మాత్రం ఏదో శాంతి వంటి అను భూతి కలగటం కొంత వింతగానే ఉన్నది. అది ఆత్మ విచారానికి మొదటి సోపానమనిగాని, భారతీయ తత్త్వ దర్శనానికి ప్రథమ ద్వారమనిగాని ప్రకాశా నికి తట్టలేదు. ఈ మెట్టు ఎక్కి, ఆ ద్వారం సమీపించి ముందుకు పోయినవారే మహావీరుడు, గౌతమబుద్ధుడు, రామకృష్ణ పరమహంస, రామానందుడు, సాయి బాబా - అని ఒక రోజున అందరూ చంద్రంగారు అనే చంద్రమౌళి తనతో అన్నప్పుడు ఏమీ అర్థంకాక ఆయన ముఖం చూచాడు. అక్కడున్న అంతమంది సభ్యుల్లోనూ చంద్రంగారితోనే కొంచెం చనువు ఏర్పరచుకున్నాడు- ఈ మధ్యనే.

ఆ చంద్రంగారే రెండు దినాలుగా కనిపించటంలేదనీ, మందులు తెస్తానని వెళ్ళినవాడు తిరిగి రాలేదనీ ఆయన కూతురు వచ్చి చెబుతున్నప్పుడు మొదట తనూ దిగ్భ్రాంతి చెందాడు. కార్యదర్శి పోలీసు కమీషనరుకూ, ఆస్పత్రులకూ ఫోను చేసి విచారిస్తున్నప్పుడు తనూ శోకతప్తుడై మౌనంగా విన్నాడు. హుసేన్ సాగర్‌లో ఒక పెద్దమనిషి శవం దొరికిందన్న వర్తమానం విని ధైర్యంతో చూడబోయిన పది మంది సభ్యులతో తనూ వెళ్ళి, కాదని తేలిన తర్వాత నిట్టూర్పు విడిచి చంద్రంగారి క్షేమానికి మౌనంగా ప్రార్థించాడు.

ఇంతకూ ఏం జరిగింది? చంద్రంగారు స్ఫురద్రూపి. మితభాషి. ఆయన ఏం ఉద్యోగం చేశాడోగాని, ఎల్లవేళలా నలగని దుస్తులు వేసుకొని చిరునవ్వుతో

తనను పలకరించేవారు. రెండు రోజుల కొకసారి ఆయన కూతురు కార్లో అక్కడ దించి వెళ్ళుతుండేది. సభ్యులనుకొంటున్న మాటల్లో, రూమర్లలో ఆయన చిరు నవ్వు వెనుక దాగి ఉన్న విషాద గాథను విని, చలించి మరింత చింతాక్రాంతుడై, మళ్ళీ తమ్ముడికి ఉత్తరం వ్రాయాలని సంకల్పించి, ప్రారంభించి, విరమించి, అర్జెంటుగా రమ్మని టెలిగ్రామ్ ఇచ్చి - నిరీక్షణలో పడిపోయాడు.

యౌవనంలోనే భార్య చనిపోతే మళ్ళీ వివాహం చేసుకోక, బిడ్డల్ని కష్ట పడి పెంచి, తన ఆతీ గతీ విచారించక విదేశాల్లో స్థిరపడ్డ కొడుకు లిద్దర్నీ తలచుకొంటూ, కూతురు ప్రేమతో చేరదీసి సంరక్షిస్తుంటే కాలం వెళ్ళబుచ్చుతూ, అడుగడుక్కూ ఒంటరినని అనుకుంటూ, అల్లుడు పలికిన ఏదో చిన్న అవమానపు మాటలకు విచలితుడై చివరకు అదృశ్యమైన చంద్రంగారు తనకు మార్గదర్శ కుడుగా దర్శనమిస్తున్నాడు. 'పరివ్రాజకుడంటే ఏమిటి?' అని ఆమధ్యనే ఆయ నిచ్చిన చిన్న ఉపన్యాసాన్ని మననం చేసుకున్నాడు. ఈ వయసులో ఆయన పరివ్రాజకుడైనాడా? లేక ఆత్మహత్య చేసుకొన్నాడా? రెంటికి వ్యత్యాసం ఉన్నదా? జ్ఞానోదయ మైనట్లుగా తన తీరని మనోవ్యధకు చంద్రంగారు మంత్రోపదేశం చేసి వెళ్ళాడా అనిపించింది. గురువు మార్గదర్శకత్వం లేనిదే మానవుడు తత్త్వాన్వేషణలో విఫలుడవుతాడని ఆయనొకసారి అన్నాడు. తను గురు వెక్కడ లభిస్తాడని ప్రశ్నించాడు. తన దుఃఖమే సరియైన గురువని ఆయన సమాధానం. ఆ మాట ఉపాసినీ బాబా అనే మహాయోగి ఎప్పుడో అన్నారట. తన ప్రశ్న కిక సమాధానం దొరికినట్లే

త్వరపడి రావద్దని, తనే బయలుదేరి వస్తున్నానని మళ్ళీ తమ్ముడికి టెలిగ్రామ్ ఇచ్చి, తన వెంటబడి ఏదో పెనుభూతం తరుముతున్నట్లుగా గృహ త్యాగానికి, ఆ పైన ప్రాణత్యాగానికి ప్రయత్నాలు చేయసాగాడు.

మొదట తన నిశ్చయం గత జీవితపు పీడకల నుండి మేల్కొన్న వాడికి శుభ శకునం గోచరించినట్లు తోచినా, తీరా ముందడుగు వేయబోయేసరికి, పశ్చాత్తాపాగ్ని వలయాలు చుట్టుముట్టినట్లు దుఃఖం, పరివేదన, సంశయ పరంపర ఎదురునిల్చి, ఆ నాటి గౌతముడు - సిద్ధార్థుడు స్మృతికి రాసాగారు. జీవితంలో ఇంకా స్థిరపడక, అర్ధాంతరంగా నిలచిపోయిన చదువులతోనూ, శాపగ్రస్తంగా మారిన నిరుద్యోగంతోనూ నిస్సహాయులై ఉన్న తన చిన్న బిడ్డల గురించితనకు బాధ్యతలేదా? పాతికేళ్ళకుపైగా ఈ సంసార రథాన్ని మిట్ట

పల్లాల జీవితపథంమీద తనతోపాటు సుఖదుఃఖాలతోలాగిన తనభార్య ఎదుర్కొన బోయే అపనిందలకు తన నిర్గమనం ప్రథమ సోపానం కాదా? అజ్ఞానంతోనో, స్వల్ప గర్వంతోనో రుక్మిణి తన నిప్పుడు అవమానించినా ఆమె జీవితమంతా నిన్న మొన్నటిదాకా త్యాగ పరంపరల ధ్యానమార్గం కాదా? అని మళ్ళీ తల పోశాడు. నిజంగా తన సమస్యల కిది శాశ్వత పరిష్కారమేనా?

జేబులో చిల్లర డబ్బులతో రోడ్డు మీద పరధ్యానంగా నడుస్తూ తన సంశయాలకు మరికొన్ని సంశయాలతో సమాధానా లిచ్చుకుంటూ ఉండగా "సార్!" అన్న పిలుపు వినిపించి నిలబడిపోయాడు. ఉడిపి కేఫ్ నుండి బయటకు వస్తూ తన ఆఫీసు అసిస్టెంటు ముద్దుకృష్ణ పిలిచిన పిలుపు. "సార్!" మీ ఫండు మనీ, మిగతా డబ్బు కూడా వచ్చింది. మీరు రాలేదని ఎదురు చూస్తున్నారు"అని చెప్పాడు. మళ్ళీ ఇద్దరూ హోటల్లో కాఫీ తీసుకుని ఆఫీసు కెళ్ళేసరికి మధ్యాహ్నం దాటింది. వచ్చిన డబ్బు మూడు వేల చిల్లర ఉంది. ప్రకాశానికి ఏనుగంత బలం వచ్చినట్లయింది.

ఎన్నాళ్ళనుంచో తను దాటవేస్తున్న చిన్న చిన్న విషయాలు - చిన్న కొడుక్కి ఒక చేతి గడియారం - చిన్న కూతురుకు ఉంగరం, ఆ రెండూ కొనగా ఇంకా రెండు వేలు మిగిలినాయి. చాలా దుర్దశలో ఉన్న మేనల్లుడికి వెయ్యి రూపాయలు డ్రాఫ్టు పంపించి; భార్యకు, పెద్ద కూతురుకు, కోడలికి మూడు వెంకటగిరి చీరలు తీసుకుని ఇల్లు చేరేసరికి సాయంసంధ్య దాటిపోతున్నది. వీధి గుమ్మంలో నిలబడి ఉన్న చిన్న బిడ్డకు అన్నీ అందిస్తుండగా, ఐస్ క్రీమ్ బండి కనిపించింది. పిలిచి - కూతురుకు పెద్ద క్రీమ్ ముక్క కొనిపెట్టి, తను వెనక పిల్లలు ఐస్ క్రీమ్ అవగానే విసుక్కున్నందుకు పరిహారం అనుకున్నాడు. అల్మారాలో అయిదు వందల రూపాయలు గడియారం కింద ఉంచి జేబు చూసుకున్నాడు. ఇంకా యాభై మిగిలి ఉన్నది.

రుక్మిణి ప్రశ్నలకు అతికీ అతకని సమాధానాలు చెబుతూ స్నానం చేసి వచ్చాడు. మళ్ళీ భార్య అదే ప్రశ్న - "ఎక్కడిది మీ కీ డబ్బు?"

"దొంగిలించలేదు. నాదే!" అన్నాడు ప్రకాశం.

"ఇంకా ఆఫీసులో వచ్చే దేమీ లేదన్నారుగా?"

"అన్నాను. కాని, వచ్చింది."

"ఆలోచనా, పద్ధతీ లేకుండా ఇవన్నీ ఎవరు తెమ్మన్నారూ అని?" మళ్ళీ రుక్మిణి.

"నేనే అనుకున్నాను. ఇక నన్ను విసిగించకు."

రుక్మిణి ఎగాదిగా చూస్తూ వెళ్ళి, ఇంకో అరగంటలో భోజనానికి కబురు చేసింది. ప్రకాశం గడియారం చూసుకుంటే ఎనిమిదిన్నర అయింది. సరిగ్గా తొమ్మిదిన్నరకు ఎక్స్‌ప్రెస్ బండి ఉంది. తను భోజనం చేసి తాపీగా బయలు దేరినా అందుతుంది. తింటూండగా ఫామిలీ పెన్షన్ కాగితాలు గుర్తుకు వచ్చి, ఆపైన వాటిని బిల్లులన్నీ భద్రపరిచే గడియారం కింద పెట్టి కిటికీగుండా చూశాడు. చిన్న కొడుకూ, కూతురు గడియారం, రింగూ మార్చి మార్చి మురి పెంగా చూసుకుంటున్నారు. వాళ్ళ ముఖాల్లో వ్యక్తమవుతున్న ఆనంద చంద్రికలు ఒక్క క్షణం ప్రకాశం దిగులును పోగొట్టినట్లు గోచరించినవి. కోడలు వెంకటగిరి బుట్టా జరీచీరె విప్పి అత్తగారికేదో విడమరిచి చెబుతున్నట్లుగా ఉంది.

అదే అదనుగా ప్రకాశం పైజామా, చెప్పులు వేసుకొని, షర్టు గుండీలు పెట్టుకుంటూ ఇంటినుండి బయటపడ్డాడు. స్టేషన్లో టికెట్ కొని మూడో ప్లాట్ ఫారమ్ చేరేసరికి, ఇంకా ఒక నిమిషమే అన్నట్లుగా గార్డు మొదటి విజిల్ వేస్తున్నాడు. రిజర్వేషన్ లేని కిక్కిరిసిన బోగీలో ఎక్కుతూ తన అడుగుజాడల గుర్తులన్నీ తుడిచివేసినట్టే అని ప్రకాశం తృప్తితోనో, అసంతృప్తితోనో నిట్టూర్పు విడిచాడు.

తెలతెలవారుతూండగా ఏదో వంతెన మీద రైలు బండి దడదడ శబ్దంతో కునికిపాట్ల నుండి మేలుకొని కిటికీ గుండా తొంగి చూశాడు. ఆశ్చర్యకరంగా అది తన స్వగ్రామమే. మాండవీక నదిమీద చిన్న వంతెన. నదికి ఆవలి ఒడ్డున శ్మశానవాటిక. అప్రయత్నంగా తన తల్లి దహన సంస్కార దృశ్యం కళ్ళ ముందు మెదిలింది. అమ్మ మూడేళ్ళ పాటు మంచంలో పడి ఉండగా, తను అహర్నిశలూ దిగులుపడుతూ కూడా ఆమెకు సేవ చేయలేక దూరప్రాంతాల్లో నివసిస్తూ, తుదకు అస్థి సంచయనం నాడు ఊరు చేరుకుని, అంజనేయ స్వామి గుడి పార్శ్వాన బావిగట్టు నానుకుని పశ్చాత్తాపంతో కుమిలిపోతూ కూర్చుని ఉన్న దృశ్యం రెండవది. ఆ తరవాత నెలలకు నెలలు తల్లిని గురించి కుంగిపోతూ

మాతృయజ్ఞం పూర్తి చేశాననే సంతృప్తి కూడా కరువై, నిదుర కోల్పోయి కాలిపోయిన రోజులు నిన్న మొన్నటివిగా తోచినవి. తన చదువుకూ, సుఖానికి అమ్మ చేసిన అతులిత త్యాగానికి తను తీర్చలేని ఋణం ఇంకెన్ని జన్మలకు తీరుతుంది? ఆ శ్మశానవాటిక, ఆ మారుతీ మందిరం జీర్ణావస్థలో ఉండబోవని, గ్రామంలో మూర్ఖ ప్రజానీకం కల్మషం చేస్తున్న ఆ తపోభూమికి ప్రహరీ కట్టిస్తానని, దేవళానికి ధ్వజస్తంభం, గర్భగుడి విమానానికి కలశ ప్రతిష్ఠ అని తనలో తాను చేసుకున్న ప్రతిజ్ఞ పూర్వీకుల గృహాన్ని పునరుద్ధరిస్తామని చేసిన బాస లాగానే ఈ జన్మలో నెరవేరేవి గావని తట్టినప్పుడు మళ్ళీ ఎన్ని జన్మలెత్తి నప్పుడు తీర్చుకోగలను? అని అంచనా వేయసాగాడు,

వారణాసిలో గంగ పారిశ్రామిక యుగపు మానవుడి దురాశతో వైతరణిగా మారి కశ్మల భూయిష్ఠమైనట్లే తల్లి అస్థికలు సంచయన నిమజ్జనాలు చేసిన మాండవీక నది కూడా కుళ్ళి కంపు గొడుతుంటే, ఒక యుగంలో అది తపో నిధుల నిత్య హోమాగ్నులతో పునీతభూమి అని, నేడది ఆత్మజ్ఞాన శూన్యుల మరుభూమి అయిందని తలచుకొని తనేమీ చేయలేడా అని నిస్పృహతో తలవంచుకొన్నాడు.

రైలు పెట్టెలోకి కాఫీ డ్రమ్ముతో మనిషి వచ్చాడు. గతి లేక ఆ నీళ్ళ కాఫీనే తాగిన కొందరు ప్రయాణీకులు మెట్టవేదాంతంలోకి దిగారు. కలికావతారం ఎప్పుడో? పూర్వజన్మ కర్మఫలం ఈ జన్మలో అనుభవించక తప్పదా? తప్పక పోతే ఈ పూజలు, ధ్యానాలు, యజ్ఞాలు ఎందుకు? ఋణ శేషం ఉంచుకున్న వాడి గతి పునరపి జననం. పునరపిమరణం, పశ్చాత్తాపం. ప్రాయశ్చిత్తం, వెనుక జన్మల పాపలాన్ని కొంతయినా నశింపజేస్తాయి.

అన్నీ వింటున్నాడు వేదాంతుల ముఖదర్శనం చేయకుండానే. ఆకలిగా ఉన్నట్లున్నా, ఆలోచనా ధోరణి తెగిపోవడం లేదు. ఋణశేషం, పశ్చాత్తాపం.... అవునా? కల్యాణికి తను చేసిన అన్యాయం ఋణమా? కాదా? తను చనిపోయే ముందు ఆమె క్షమార్పణ కోరి జన్మ విముక్తి చేసుకోకపోతే మళ్ళీ నరజన్మ దొరకదేమో అని కదా వాళ్ళు చెబుతున్నది. దేహంలో స్వయంభువమైన అగ్ని అవయవాల నన్నిటినీ కాలుస్తున్నట్లవుతున్న ఆవేదనతో తరువాతి జంక్షన్‌లో ప్రకాశం బండి దిగి, మద్రాసుకు పోయే బండి ఏ ప్లాటుఫారం మీద ఆగుతుంది అని ప్రశ్నిస్తున్నాడు. అంతవరకే ఆతని జ్ఞాపకం

తిరిగి మద్రాసు సెంట్రల్ స్టేషన్ పక్కనే వాల్టాక్స్ రోడ్డులో ఎవరో మలయాళీ కుర్రవాడు మిట్టమధ్యాహ్నం తన ముఖం మీద సోడానీళ్ళు చల్లు తున్నప్పుడు ఒక జ్ఞాన వీచిక వీచినట్లు నేత్రాలు విప్పి చూచాడు. మళ్ళీ తమో నిద్రా ముద్ర, ప్రళయ జలధిలో తేలిపోతున్నట్లు భావన. ఇంకొక క్షణిక స్మృతి- తను జనరల్ ఆస్పత్రి ఇంటెన్సివ్ కేర్ వార్డులో ఒక నర్సునూ, పోలీసునూ, ఒక మధ్యవయస్కురాలైన కళ్ళజోడు డాక్టరునూ చూసినప్పుడు మెదడులో మెరిసింది.

ఎవరు, ఎవరు అని వాళ్ళ ప్రశ్న.

డాక్టర్ కల్యాణి అని తన నత్తి జవాబు.

ప్రకాశం స్వగతం ఒక తన పని మానుకున్నది. తనున్నాడో, లేదో తనకు తెలియదు, సీతాకోకచిలుక నిద్రావస్థ కాదది. యోగసమాధి కావచ్చు. జీవన్మృతి కావచ్చు.

*　　*　　*

హేమంత ఉషఃకాంతిలో గులాబిపుష్పం వలె ఒకనాడు ఇద్దరూ విద్యార్థి దశలో ఇంకో లోకంలో విహరిస్తున్న ఒకానొక కాలంలో హఠాత్తుగా దర్శన మిచ్చింది కల్యాణి.

"మా అమ్మాయికి సరాసరి లెక్కలు సరిగా అర్థం కావటం లేదు. కొంచెం చెప్పు, నాయనా!'' అని ఆ పిల్ల తండ్రి తనను - వరండాలో పుస్తకాల మధ్య తల ఇరికించి ఏ జగత్తు లీలల్లోనో ఆనందమో, ఆందోళనో అనుభవిస్తున్న తనను చిరునవ్వుతో పలకరిస్తున్నప్పుడు, హడావిడిగా అమ్మ వచ్చి వాళ్ళను మర్యాదతో ఆహ్వానించి చిరుచాప పరుస్తున్నప్పుడు తను సిగ్గుతో మారుమాట్లాడ లేక కళ్ళప్పగించకుండానే దిక్కులు చూస్తున్నప్పుడు ఆ విరుస్తున్న గులాబిమొగ్గ తన లెక్కల పుస్తకం తెరిచి వేలితో ఒక లెక్కను చూపించినప్పుడు, తనకు కొంచెం అదను దొరకగానే తన లెక్కల నోట్సు తెరిచి ఆ లెక్కను స్టెప్స్‌తో సహా నీటుగా తన వేలితో నిర్దేశించినప్పుడు - ఈ కల్యాణి తన భావిజీవిత నాట కంలో ఒక ప్రధాన పాత్ర ధరించబోతున్నదని ప్రకాశం ఎలా ఊహించగలడు?

అట్లాగే ఇద్దరూ కాలేజీలో చేరటం. స్త్రీ కళాశాలలు ఇన్ని లేని ఆ కాలంలో అబ్కారి ఇన్‌స్పెక్టరు కొడుకు అకతాయితనంగా కల్యాణిని ఏడిపిస్తున్న రోజున

తను లాగి లెంపకాయ కొట్టి, వాడి జుట్టు వంచి వీపుమీద దభీల్మని రెండు గుద్దులు గుద్ది, ఆమెను ఇంటివద్ద దించి, నాన్నగారు కాలేజీ మాన్పిస్తారనే భయంతో ఎవరికీ చెప్పవద్దని ఆమె నేత్రావధానాన్ని తను అర్థం చేసుకొని తల పంకించి వెనుదిరిగిపోతూ చిరునవ్వు నవ్విన రోజు నిన్నటిదా, మొన్నటిదా?

వికసించిన ఆ గులాబి పువ్వు కొన్నాళ్ళకు గలగలపారే స్వచ్ఛ జలాల సెలయేరులాగా తనను పదేపదే ఆకర్షించిన రోజుల్లో గూడా ప్రకాశానికి ప్రేమంటే ఏమిటో తెలియదు. కాని సైన్సు గ్రూపు డిగ్రీ పరీక్షల ముందు కల్యాణి తనకు అకస్మాత్తుగా కబురు పంపి, ''నాన్నగారు పెళ్ళిమాట తలపెడ్తున్నారు'' అని తలదించుకొని గద్గద స్వరంతో అన్న క్షణాన తన కాళ్ళు భూమిలోని అగాధ లోయలోకి దిగబడి పోతూండగా, ఆ కల్యాణ దేవత ఎదురుచూచిన అభయ వాక్కు తన నోటి నుండి బయల్వెడలే దెందుకు? కులం అడ్డులేకపోయినా వయసు అడ్డుపడ్డదా? తన కుటుంబ పరిస్థితుల్లో వెంటనే ఉద్యోగం చూచుకో వాల్సిన ఒత్తిడా? ఇంటికి వెళ్ళి అమ్మతో చెప్పలేక అన్నం కంచం వదిలి పోతున్నప్పుడు ఆమె తన ఆందోళనను, వ్యాకులతను ఇంకో విధంగా గ్రహించి మాట మార్చబోయినప్పుడైనా తనెందుకు బయటపడలేదు? ఏనాడూ సమస్యల కెదురు నిలిచి సాహసించలేని తనకు కల్యాణి తన హృదయాన్ని ఇంత సూటిగా కాలవ్యవధి కల్పించకుండా అర్పించటమే విధి వక్రీకరణకు కారణభూతమా? తన పిరికితనాన్ని అర్థం చేసుకొని, కల్యాణి తన తండ్రితో ఎదురునిలిచి మాటలు లేని పాటలతో రొదచేసే సెలయేరు శాపగ్రస్తయై మూగబోయినట్లుగా, ఆనాడు చెప్పలేకపోయిందా? తీరా ముహూర్తాలు పెట్టుకొంటున్నట్లు తెలిసి అమ్మనూ, అన్నయ్యనూ వాళ్ళింటికి పయనమై పోతుండగా చూసి, ఏం సమాధానం వస్తుందో అని తను దూరంగా పార్కులో చెట్టునీడను కూర్చుని రాత్రి పొద్దుపోయి ఇంటికి పిల్లిలాగా చేరి అన్నయ్య గంభీర వదనం చూసి బెదిరిపోయి, అమ్మ తన అమృత హస్తంతో తన వీపు నిమురుతున్న సమయాన వెక్కివెక్కి ఏడ్చి, అవ్యాహతమైన విధి భ్రమణను మరల్చగలిగాడా? రాత్రి ఇచ్చిన ధైర్యంతో, తనే వెళ్ళి ఎదురు నిల్చి మాట్లాడి, ఆ సంబంధాన్ని మానుకోమని నచ్చచెప్పటమో, ప్రాధేయ పడటమో. బెదిరించటమో - చతుర్విధోపాయాలు ప్రయోగిద్దామనే నిశ్చయానికి వచ్చి ఉదయం పిరికిపందవలె పుస్తకాల మధ్య గ్రంథాలయంలో దాగుకున్న తనను భగవంతుడు కూడా రక్షించలేదని ఆత్మ విమర్శ చేసుకొన్న దెందుకు?

అంతటితో విరమించి తన పుస్తక ప్రపంచం వెనుక రక్షణ తీసుకొనక, ఎన్నడూ క్షమార్హం కాని తప్పు, కలకాలం గుండెల్లో ముల్లుగా వేధించే అల్ప సాహసానికి ఎందుకు పాల్పడ్డాడో ఇప్పటికీ ప్రకాశానికి అంతుపట్టటం లేదు.

తీరా రెండు రోజుల్లో కల్యాణి కల్యాణ ఘడియ ఉండగా, లైబ్రరీలో పుస్తకాలు వాపసుచేసి వరండా స్తంభం క్రీనీడలో నిలుచున్న ఆమె చేతివేళ్ళను తన చేతివేళ్ళలో బంధించినపుడు, అది ఆమె పాణిగ్రహణంగా భావించి, ఈ ఆఖరు క్షణంలోనైనా తన విషాదాగ్ని మింగనున్న శంకరుడు ప్రత్యక్షమై వరప్రదానం చేయనున్నాడని ఉత్కంఠయై మ్రాన్పడిపోయినప్పుడు, ఒక్క పలుకు లేకుండా, ఒక్క ఓదార్పు లేకుండా, ఒక్క క్షమావాక్యం లేకుండా లజ్జారహితుడై తను తిరోగమించటాన్ని ఏ శాపవాక్యాలు వర్ణించగలవు? అప్పటికే కల్యాణి ఇతరుల సొత్తు, అభరణమై ఉన్నదని సత్యం తెలిసినా తను నిందార్హుడై ప్రవర్తించి, మరణశయ్యమీద ఈనాడు ఆమె క్షమ కొరకు యముడితో పెనుగులాడుతూ వైద్యశాస్త్రానికి, వైద్యవేత్తలకు ఆశ్చర్యం కలిగిస్తున్నాడు ప్రకాశం.

ఈ బ్రతుకును, ఈ ప్రాణధారను, ఈ జీవన సరిగమలను ఒక్క క్షణం. ఒక్క క్షణం - భగవంతుడు పొడిగిస్తే, ఆమెకు క్షమార్పణ లర్పించి నిర్గమించగలనని ప్రార్థిస్తున్న తరుణంలో నిజంగా కనులువిప్పి, ఎదుట ఉన్న ప్రౌఢ కాంత కల్యాణిని గుర్తించి చేతులు జోడించబోయాడు. కాని, ఎడమచేయి లేవలేదు. సజల నేత్రాలతో మాట్లాడబోయాడు. వామపార్శ్వం కదలటం లేదు.

అతని చేతిని మృదువుగా నిమురుతూ కల్యాణి ఆ ప్రయత్నాల్ని వారించింది. మళ్ళీ ప్రకాశం మత్తుసుగతలోకి జారిపోయి వారం దినాల తర్వాత కొత్త పరిసరాల్లో, కొత్త సంగీత మృదుల నిస్వనాల్లో మేల్కొన్నాడు. అన్ని అవయవాలు కదులుతున్నట్లే ఉన్నవి. "డాక్టరు వస్తున్నారు. కదలకుండా పడుకోండి" అని తమిళంలో పలికిన నర్సు మందహాస వదనాన్ని తిలకించి తనూ మందహాసం చేస్తూండగా, చేతిలో ఇంజెక్షను సిరంజి పట్టుకొని డాక్టరు కల్యాణి ప్రవేశించింది.

అతి ప్రయాసతో ప్రకాశం పెదిమలు కదల్చగలిగాడు - "క... ల్యా.... ణీ....నన్ను....నన్ను....క్ష...."

కల్యాణి నిండుగా నవ్వుతూ తన నోటి మీద చేయి వేయబోయి, నిరంజి చూచుకొని "మాట్లాడకు, నాయనా....కష్టాలు, శ్రమలు అన్నీ అయిపోయినయ్. విశ్రాంతిగా పడుకో" అంటున్నది. ఎంత సున్నితంగా సూది గుచ్చిందో తనకు తెలియనే తెలియదు. జనరల్ అస్పత్రినుండి, మిత్తిదయ్యం కోరలనుండి తనను విడిపించి కల్యాణి ఆమె ఇంటికి చేర్చిందని మాత్రం ప్రకాశం గ్రహించాడు.

కల్యాణి ఉదంతం రుక్మిణికి కొంతవరకయినా తెలియక కాదు. తెలుసు. కల్యాణికి పెళ్ళి కావటం. అత్తగారింట్లో ఆమెపడ్డ యమ చెరలు, ఆ తర్వాత భర్త వెళ్ళగొట్టటం, కల్యాణి మెడికల్ స్టూడెంటుగా ఒకసారి ప్రకాశాన్ని కాకతాళీయంగా ఏదో స్టేషన్లో కలియటం, ఆ చదువులో ఉండగానే భర్త మరణం - బహుశా ప్రకాశం నుండి విన్నదో, పెద్ద తోడికోడలు ద్వారా విన్నదో. తనైతే ఈ విషయంలో ప్రకాశాన్ని ఎప్పుడూ దెప్పిపొడవలేదు. గృహ ఛిద్రాలు తలచూపినప్పుడు ఆవేశంలో ఒకసారి మాత్రం అన్నది: "నా దరిద్రపు ముఖాన్నే ఎందుకు చేసుకున్నారు? ఆ డాక్టరు పిల్లనే పెళ్ళాడి ఉంటే సుఖపడి పొయ్యేవాళ్ళు గదా!"

ప్రకాశానికి తన మామూలు బలం చేకూరినట్లుగా తోస్తున్నది. లేచి నుంచొని కాలెండరు చూస్తూండగా కల్యాణి వెనకే వచ్చి "అవును, నీకు బలం వచ్చింది. ఆలోచనా వచ్చింది. ఇక చచ్చిపోయే ప్రయత్నం మళ్ళీ చేయొచ్చు" అని నవ్వుతూ అన్నది.

"నీ కెట్లా తెలుసు, కల్యాణీ!"

"అన్నీ తెలుసు, నువ్వు కొత్త ధోవతులు కట్టుకోకుండా దిండుకింద దాచింది అందుకే గదా! రా-వచ్చి ఈ గుడ్డలు కట్టుకో. గడ్డం చేసుకో. మా ఇంటికి రేపో ఎల్లుండో చుట్టాలు పక్కాలు వస్తున్నారు".

"అయితే, నేను వెళ్ళిపోతాను."

"ఎక్కడికి?"

ప్రకాశం ఆమె ముఖంలోకి మొదటిసారిగా పరిశీలనగా దృష్టి సారించాడు. కన్నీళ్ళ మసకలో సరిగా కనిపించక తల తిప్పుకొని కిటికీగుండా ప్రహరీగోడ పక్కన వరసగా ఉన్న క్రోటన్ తొట్లను చూస్తున్నాడు.

"అవును చావటం చాలా సులభం, ప్రకాశం! ప్రపంచాన్ని, పరిసరాల్ని అర్థం చేసుకోవటమే చాలా కష్టం. అందులో నీ వంటి పండితులకు అది మరీ దుస్సాధ్యం. చదివింది కాలాన్ని చంపటానికైతే ఇక చెప్పేదేముంది?"

రెక్కపుచ్చుకుని మంచంమీద కూచోబెట్టి పాలు, రొట్టె, ఉడకబెట్టిన గుడ్లు ఉన్న ట్రే మెల్లగా ముందుకు తోసి - "తిను, మాట్లాడుకుందాం. ఇవ్వాళ నాకు నర్సింగ్ హోమ్‌లో పనిలేదు" అన్నది.

ఆమె గది దాటిపోగానే కిందటి వారం మెట్లమీద కల్యాణి ఎవరితోనో మాట్లాడుతున్నప్పుడు విన్న రెండవ గొంతుక తన పెద్ద కొడుకుదేనా అన్న అనుమానం వచ్చి చేతిలో రొట్టెముక్కను గాలిలో స్తంభింపజేసినట్లుగా పట్టుకొన్నాడు. అతను టిఫిన్ ముగిస్తుండగానే పనిమనిషి వచ్చి షేవింగు సామాను ముందు పెట్టింది. తను స్నానాల గదినుంచి తిరిగి వచ్చేసరికి మంచం నీటుగా సర్ది ఉంది. కొత్త పైజామా, బనియన్లు, షర్టు పరిచి ఉన్నవి. ప్రకాశం మాట్లాడకుండా కొత్త గుడ్డలు వేసుకొని దినపత్రికలోకి ముఖం దూర్చాడు.

పత్రికలో వార్తలు కాదు తను చదువుతున్నది-కల్యాణి అన్న మాటలు. ఆనాడు....ఆనాడు....కల్యాణి ఆత్మహత్యే చేసుకుని ఉంటే, ఈనాడు తను ఎవరిని క్షమావణ కోరుకొని ఉండేవాడు? తన జీవితం ఏ మలుపు తిరిగి ఉండేది? ఆ ఆవేదనలో తను బ్రతికి ఉండేవాడేనా? కల్యాణి రెండోసారి తనకు ప్రాణదానం చేసిందన్న మాట! ఈ త్యాగానికి అర్థం ఏమిటి?

"అమానుష పరిస్థితుల్లో గూడా మానవుడు తన మానవత్వాన్ని కోల్పోగూడదు, ప్రకాశం! నువ్వు నాకు ఋణపడి ఉన్నానంటున్నావు. తన తల్లికీ, దేశానికీ, ఇంటికీ, చేసుకున్న భార్యకూ, తోటివాళ్ళకూ - మనిషి ఎప్పుడూ బాకీలోనే ఉంటాడు. ఆలోచిస్తే ఇవి సినిమాల్లో డైలాగులు కావు. నీవు చదివి జీర్ణించుకోలేని ప్రాచీన రహస్యాలు, జీర్ణించుకొన్నాననుకొన్న మార్క్సిస్టు ఉపదేశాలు. ఈ బాకీ తీర్చుకోకుండా పారిపోవడమే అజ్ఞాన లక్షణం. బాధువా లక్షణం. ఇవన్నీ మనం చదువుకునేటప్పుడు నువ్వు నేర్పిన పాఠాలే. జ్ఞాపకం తెచ్చుకో" అంటున్నది కల్యాణి.

ఒకానొక సందర్భంలో షిర్డీ సాయిబాబా తన దైన్యాన్ని వెళ్ళబోసుకొంటున్న ఒక భక్తుడితో ఇట్లా చెప్పాడు - "తల్లి తాబేలు బిడ్డల్ని తన చెంతనే ఉంచుకోదు. నదిలో ఆవలి తీరాన ఉంచుతుంది. ఈ తీరాన తను ఉండి తన చల్లని చూపులతోనే వాటిని రక్షిస్తూ ఉంటుంది." ప్రకాశం ఇది స్మృతికి తెచ్చుకొని కల్యాణివంక తేరిపార జూశాడు.

"నా లెక్చరు వినే ఓపిక ఇంకా ఉందా?" అన్నది తను.

అవి లెక్చర్లు కావు. తన మనస్తత్వాన్ని విశ్లేషణ చేసిన కరతలామలకంగా, తనకు అర్థయుతంగా బోధిస్తున్నది అని ప్రకాశానికి తట్టింది.

"అయితే, రుక్మిణితో నీకు తగాదా వచ్చి, కోపం తాపం కింద, తాపం ప్రాణహింస కింద మారిపోయి మద్రాసు చేరావన్న మాట?!"

తను తల పంకించాడు చిన్న బాలుడిలా.

"దోపిడీ వ్యవస్థ ఇది అని ఎన్నిసార్లో నాతో వాపోయేవాడివి. మన భయం, చంచలత్వం - అన్నీ ఈ వ్యవస్థాజనితాలేగదా?! నీ సంపాదన తగ్గి, సంసార బాధ్యతలు అట్లాగే ఉన్నప్పుడు రుక్మిణికి మాత్రం ఈ బ్రతుకు భయం ఉండదా, ప్రకాశం? స్త్రీ సహజమైన ఆవేశంతో నీకు చెప్పబోయిన విషయాన్ని నీ పురుషాహంకారానికి దెబ్బ తగిలిందనీ, రిటైరు అయ్యాక నీ అధికారం సాగదనీ పెడార్థాలు కల్పించుకొన్నది నీవు. బాగా ఆలోచించు, భవిష్యత్తును గురించిన ఆందోళనే గాదు, రుక్మిణి వయస్సెంతో నీకు తెలుసుగదా? స్త్రీ శరీరంలో ఈ వయసులో కొన్ని మార్పులు వచ్చి, ఆలోచన సన్నగిల్లి, ఆవేశం పెల్లుబుకుతుందని నీవంటి చదువుకొన్న పెద్ద మనుషులకు గూడా అర్థం కాకపోతే చచ్చేదెట్లా?"

"రుక్మిణి....నీకు...."

"రాయనూ లేదు, చెప్పనూ లేదు....అస్పత్రి మంచం మీద నీ కలవరింతల్ని వైద్యులు గ్రహించలేరనుకొంటున్నావా, పిచ్చినాయనా?"

పిచ్చినాయన మాట్లాడక వేరే దిక్కులు చూస్తూన్నాడు. ఇనుము, ఉక్కు కంటేకూడా బలమైనది మానవుడి ఆశాదృక్పథం - ఆశయ విన్యాసం. జీవనది నుండి విడిపోయి ఎండిపోతున్న చిన్న ఏరు మళ్ళీ చెమర్చి మధుర జలధారల్ని

నింపుకొని ప్రధాన నదంతో కలిసిపోయి, తనదైన ప్రత్యేక గానాన్ని ఆలాపిస్తూ సాగిపోతున్నది. అది కల్యాణి నవ్వుల వెనక రహస్యం. తనకు జీవితమూ, చదువూ రెండూ కలిసినా నేర్పలేని గురు ప్రవచనం.

ఏమీ తోచక నెల రోజుల నాటి పాత పత్రికలు తిరగేస్తున్నాడు. హఠాత్తుగా తన ఫోటో, దాని కింద పెద్ద కొడుకు, రుక్మిణి వ్రాసుకొన్న వేడ్కోలు....'మమ్మల్ని క్షమించండి. తిరిగి రండి పిల్లలు తల్లడిల్లిపోతున్నారు.' ప్రకాశం పత్రిక మూసి కల్యాణిని వెతుకుతూ మెట్లు దిగి పరుగిడబోయాడు. కిటికీగుండా కనిపిస్తున్న దృశ్యం. కల్యాణి కారు తలుపు తీస్తున్నది. రుక్మిణీ, కొడుకులు, కోడలు దీన వదనాలతో కారు దిగుతున్నారు. వెనుదిరగబోయి, మళ్ళీ ధైర్యం తెచ్చుకొని మెట్లు దిగి తనే వాళ్ళకు ఎదురుపోయాడు.

అతని కెవరూ దోషులుగా కన్పట్టలేదు. అందరూ తనవలెనే జీవితం అర్థంకాని అల్పజ్ఞమానవులుగా తోచారు. కరదీపిక పట్టుకొని చీకటికాంతారంలో అందరికీ దారి చూపుతున్న వనదేవత వలె కల్యాణి సాక్షాత్కరించింది. కన్నీళ్ళాపుకుని ప్రకాశం చూస్తున్నాడు. అత నిప్పుడు వయోవృద్ధుడో, జ్ఞానవృద్ధుడో తేల్చుకొంటున్నాడు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఆగష్టు 85)